సాక్షి మహబూబాబాద్

సోమవారం । 30 । జనవరి । 2023



మహిళా అభివృద్ధికి ప్రాధాన్యం

మహిళల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.

- 8లో▸



'స్పౌజ్'లో అవకాశం కల్పించాలి

స్పౌజ్ కేటగిరీలో పండిట్, పీఈటీల బదిలీలు చేపట్టాలని పలువురు స్పౌజ్ టీచర్లు విద్యా శాఖ మంత్రిని కలిసి అభ్యర్థించారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
35.0^0/15.5^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మంచుతో పాటు చలి తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

కేంద్ర ప్రభుత్వానివి ప్రజావ్యతిరేక విధానాలు



కేసముద్రం: కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని కల్వల గ్రామంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు బీజేపీ ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే అధికారంలోకి వచ్చి ఎనిమిదేళ్లు గడుస్తున్నా ఉద్యోగాలు ఇవ్వలేదని, ఉన్న ఉద్యోగాలు పోతున్నాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తూ కార్మికులు, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు రాజన్న, వెంకటేశ్వర్లు, పాపారావు, యాకూబ్ రెడ్డి, చాగంటి కిషన్ పాల్గొన్నారు.

కవులు సమాజానికి అవసరం

నర్సింహులపేట: కవులు సమాజానికి ఎంతో అవసరమని ప్రముఖ గాయకుడు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని పెద్ద నాగారంలో వికాస వేదిక సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాహిత్యరంగంలో నూతన ఒరవడులకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. నాటి కవులు రాసిన పుస్తకాలను నేటితరం వారు ఆదరిస్తున్నారని కొనియాడారు. మంచిపూలు పుస్తకం రాసిన జహిరొద్దీన్, గుండె చప్పుడు రచించిన రామయ్య, కలలు చెదిరిన కల్లు రచించిన శ్రీనివాస్, సాధనాల సాహితి పుస్తకం రాసిన సారబాలును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలోఎంపీపీ సుశీల, సర్పంచ్‌లు సామిరెడ్డి, కళావతి, వికాస వేదిక అధ్యక్షుడు వెంకటస్వామి, కవులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామప్ప శిల్పకళ అద్భుతం



వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండల పరిధిలోని రామప్ప దేవాలయం శిల్పకళ అద్భుతంగా ఉందని డీజీ, నేషనల్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అరుణబహుగుణ అన్నారు. ఆదివారం సాయంత్రం నూతన ఎస్పీ గౌస్ ఆలం, ఓఎస్డీ అశోక్ కుమార్, ఏఎస్పీలు సుధీర్ రాంనాథ్ కేకన్, సంకీర్త్‌లతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్, రాజుకుమార్ వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు జరిపించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం టూరిజం గైడ్ ద్వారా ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. వారి వెంట సీఐ రంజిత్ కుమార్, ఎస్సైలు తాజొద్దీన్, తదితరులు ఉన్నారు.

రేపు కేడీసీలో ప్రీ న్యాక్ మీట్

విద్యారణ్యపురి: ఈనెల 31న కేడీసీలో ప్రీ న్యాక్ మీట్ (పూర్వ విద్యార్థుల సంఘ సమావేశం) నిర్వహించనున్నట్లు ఆదివారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ రాజారెడ్డి తెలిపారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ (న్యాక్) 'ఏ' గ్రేడ్ సాధించడమే లక్ష్యంగా.. కళాశాల ప్రిన్సిపాల్ రాజారెడ్డి, ఐక్యూ ఏసీ డైరెక్టర్ రమేశ్, అన్ని విభాగాల అధ్యాపకులు కసరత్తు చేస్తున్నారు. అందుకు సంబంధించి న్యాక్ ప్రతిపాదనలను ఇటీవలే పంపారు. న్యాక్ పీర్ టీం ఫిబ్రవరి 15, 16 తేదీల్లో కేడీసీని సందర్శించి పరిశీలించనుంది. అకాడమిక్ పరంగా మౌలిక వసతులు తదితర కార్యక్రమాల అమలును ప్రత్యక్షంగా పరిశీలించనుంది. ఈనేపథ్యంలో కేడీసీ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమావేశాన్ని (ప్రీ న్యాక్ మీట్)ను ఈనెల 31న నిర్వహించనున్నారు. పూర్వ విద్యార్థుల ద్వారా కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు చూపించనున్నారు. నిధులు కూడా సమీకరణపై ఈసమావేశంలో చర్చించనున్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, పీసీసీ కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఉన్నారు. ఈసమావేశానికి పూర్వ విద్యార్థులు హాజరు కావాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ రాజారెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎస్‌వీఎస్‌చారి, సెక్రటరీ డాక్టర్ సోమిరెడ్డి, కోశాధికారి డాక్టర్ ఎస్.వినోదర్ రావు ఆదివారం కోరారు.

వామ్మో.. శునకాలు

- గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి
- నిత్యం ఏదో ఒకచోట ఘటన
- జిల్లాలో పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- శునకాల నియంత్రణకు తొర్రూరు, మహబూబాబాద్‌లో ఏబీసీ కేంద్రాల ఏర్పాటు



తొర్రూరు పట్టణంలో గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

తొర్రూరు: జిల్లాలో కుక్కల బెడద అధికమైంది. రద్దీ కూడళ్లు, రోడ్ల వెంట కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. జిల్లాలో నిత్యం ఏదో ఒకచోట కుక్కకాటు బాధితులు ఆస్పత్రులకు వస్తూనే ఉన్నారు. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

గుంపులుగా..

పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో రద్దీ ప్రాంతాలు, రహదారులపై శునకాలు గుంపులుగా సంచరిస్తున్నాయి. రాత్రి వేళ రోడ్లపై ఉంటూ ద్విచక్రవాహనదారులు, పాదాచారులను వెంబడిస్తున్నాయి. కొందరు వీటి కాటుకు గురవుతుండగా మరికొందరు వాహనాల పైనుంచిపడి గాయాల పాలవుతున్నారు. జిల్లాలో గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు 4,107మంది కుక్క కాటుకు గురవ్వగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు 250మంది బాధితులయ్యారు. తాజాగా తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని సాయినగర్, రాజీవ్‌నగర్, దుబ్బతండా, రిక్షా కాలనీల్లో ఎనిమిది మంది, మండలంలోని చింతలపల్లి మాటేడు గ్రామాల్లో 10మంది ఒకేరోజు కుక్క కాటుకు గురయ్యారు.

బాధ్యతే అయినా..

నియంత్రణ బాధ్యత స్థానిక సంస్థలదే అయినప్పటికీ సిబ్బంది కొరత, ఇతర కారణాలతో పట్టించుకోవడం లేదు. ప్రత్యేక సమయాల్లో ఒప్పంద పద్ధతుల్లో సిబ్బందిని నియమించుకునే ప్రతిపాదన ఉన్నా ఆ దిశగా ఆలోచించడం లేదు. వాటిని పట్టి తీసుకెళ్లే వాహనాలు సైతం జిల్లాలో అరకొరగా ఉన్నాయి. సంతాన నియంత్రణ చర్యలు అసలు చేపట్టడంలేదు. స్థానిక సంస్థల్లో శునకాల సమస్య తీవ్రతను బట్టి ఏటా రూ.50 వేల నుంచి రూ.2లక్షల వరకు ఖర్చు చేసే వెసులుబాటు ఉంటుంది. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి యాంటీ రేబిస్ టీకాలు వేయించాలి. కానీ ఈ ప్రక్రియ సక్రమంగా జరగకపోవడం ఇబ్బందిగా మారింది. కొన్ని పంచాయతీలు, మున్సిపాలిటీల్లో కుక్కలు, పందుల పట్టివేత పేరుతో నిధులు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.



తొర్రూరులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్



తొర్రూరులో కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన చిన్నారి(ఫైల్)

జిల్లాలో రెండు ఏబీసీ కేంద్రాలు..

కుక్కల నియంత్రణకు జిల్లాలోని మహబూబాబాద్, తొర్రూరులో ఎనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే మహబూబాబాద్‌లోని కుమ్మరికుంట్ల తండా వద్ద నెలకొల్పిన ఏబీసీ సెంటర్‌లో కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు 2600 కుక్కలకు ఆపరేషన్లు జరిగాయి. తొర్రూరులో పశువుల సంత సమీపంలో రూ.20లక్షలతో ఏబీసీ సెంటర్‌ను నిర్మించారు. ఇంకా సేవలు ప్రారంభం కాలేదు. తొర్రూరులో నిత్యం ఏదో ఒక కాలనీలో స్థానికులు కుక్కకాటుకు గురవుతున్నా ఏబీసీ సెంటర్‌ను ప్రారంభించి కుక్కలకు శస్త్ర చికిత్సలు జరపడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. ఏబీసీ ప్రోగాం నిబంధన–2001 ప్రకారం జంతు సంరక్షణ బోర్డు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అన్ని మున్సిపాలిటీలు నిబంధనలు పాటించాలని ఆదేశాలు అందాయి. వీధుల్లో కుక్కలను పట్టుకుని ఏబీసీ కేంద్రానికి తరలించడం, తిరిగి అదే ప్రాంతంలో వదిలిపెట్టడానికి ఒక కుక్కకు రూ.200, సంతానోత్పత్తి తగ్గించేందుకు ఆపరేషన్, ఆ సమయంలో జాగ్రత్తలు తీసుకోవడం, మందులు ఇవ్వడం, వాటికి నాలుగైదు రోజులు పౌష్టికాహారం ఇచ్చేందుకు రూ.1,450 చెల్లించనున్నారు.

కుక్కల బెడదను నివారిస్తాం



కుక్కల్లో సంతానోత్పత్తిని తగ్గించేందుకు ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను తొర్రూరులో నిర్మించాం. అతి త్వరలో దాన్ని ప్రారంభించి కుక్కలకు ఆపరేషన్లు నిర్వహించేలా చర్యలు చేపడుతాం. ప్రభుత్వ ఆస్పత్రిలో కుక్క కాటుకు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించాం. వీధి కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తాం. ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తాం.

-సింగారపు కుమార్, ఇన్‌చార్జ్ కమిషనర్, తొర్రూరు మున్సిపాలిటీ

'అట్లాస్'లో అంతంతే..!

రాష్ట్ర గణాంకాల్లో ఉమ్మడి వరంగల్ పరిస్థితి

- జిల్లాల్లో ప్రగతి తక్కువ, వెనుకబాటే ఎక్కువ..
- జీడీడీపీలో 17 పైస్థానాలే.. 'తలసరి'లో భూపాలపల్లి భేష్..
- ఐదు జిల్లాలు వెనుకబాటు.. అట్టడుగున హనుమకొండ
- ఉమ్మడి జిల్లా ఆర్థికంగా పుంజుకోవాలి.. సూచిస్తున్న 'అట్లాస్–2022' నివేదిక

ఓరుగల్లు జిల్లా ఆర్థికంగా మరింతగా పుంజుకోవాలి.. అన్ని రంగాల్లో వేగం మరింతగా పెంచాలి.. ఇలా జరిగితేనే అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ముందంజలో ఉన్న జిల్లాల సరసన చేరుతాం. ఆయా అంశాలను ప్రభుత్వం విడుదల చేసిన తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్(అట్లాస్) నివేదిక–2022 సూచిస్తోంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 16 అంశాలపై అధ్యయనం చేసిన తర్వాత ఆయా రంగాల్లో జిల్లాల పరిస్థితిని వివరించింది. వివిధ రంగాల్లో ఆయా జిల్లాల స్థానాలను ప్రకటించింది. – సాక్షిప్రతినిధి, వరంగల్

- 8లో▸

జిల్లాలవారీగా స్థూల దేశీయోత్పత్తి (రూ.కోట్లలో..), జిల్లా తలసరి ఆదాయం(రూ.లలో..) ఇలా..

జిల్లా	జీడీడీపీ	రాష్ట్రంలో స్థానం	తలసరి ఆదాయం	రాష్ట్రంలో స్థానం
హనుమకొండ	16,588	17	1,30,821	33
వరంగల్	14,276	22	1,71,111	16
జేఎస్ భూపాలపల్లి	10,862	26	2,15,612	04
ములుగు	5,626	33	1,63,285	18
మహబూబాబాద్	13,368	23	1,48,711	27
జనగామ	10,651	27	1,72,118	15

జిల్లాలవారీగా రహదారుల సౌకర్యం

జిల్లా	జాతీయ రహదారులు	పంచాయతీరాజ్ రోడ్లు	ఆర్అండ్‌బీ రోడ్లు	మొత్తం (కి.మీలలో..)
హనుమకొండ	105.35	1,365.46	530.46	2,001.27
వరంగల్	149.50	1,583.14	536.52	2,269.16
జేఎస్ భూపాలపల్లి	107.36	1,459.83	546.25	2,113.44
ములుగు	136.60	967.52	460.45	1,564.57
మహబూబాబాద్	275.30	2,340.16	846.58	3,462.04
జనగామ	119.29	1,802.97	481.05	2,403.31

అన్నిదానాల్లో రక్తదానం గొప్పది

మహబూబాబాద్: అన్నిదానాల్లో రక్తదానం గొప్పదని మానుకోట ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మానుకోట శాఖ ఆధ్వర్యంలో స్నేహ యూత్ అసోసియేషన్ సహకారంతో స్థానిక హౌసింగ్‌బోర్డు కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం కర్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రజలు రక్తదానం చేసేలా ప్రోత్సహించాలని స్వచ్ఛందసంస్థలు, అసోసియేషన్లకు సూచించారు. రక్తదానం వల్ల ఆపదలో ఉన్న వారిని ఆదుకునే అవకాశం ఉంటుందన్నారు. 18 సంవత్సరాలు నిండి, ఆరోగ్యవంతులైన వారు రక్తదానం చేయచ్చన్నారు. కార్యక్రమంలో స్నేహ యూత్ అసోసియేషన్ వ్యవస్థాకుడు నూకల నరేష్‌రెడ్డి, వరప్రసాద్, వెంకట్‌రెడ్డి, రవిచందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భక్తజన సందడి



క్యూలో వస్తున్న భక్తులు



సమ్మక్క గద్దె వద్ద కిక్కిరిసిన భక్తులు

- మేడారానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిన అమ్మవార్ల గద్దెలు
- మినీ మేడారానికి రెండు రోజులే గడువు
- ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుల చర్యలు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మ దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆదివారం సెలవురోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. వనదేవతల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం, చీరసారె, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజులను దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో సమ్మక్క–సారలమ్మ గద్దెలు కిక్కిరిసిపోయాయి. మొక్కుల అనంతరం భక్తులు మేడారం పరిసర ప్రాంతాల్లో విడిది చేసి వంటావార్పు చేసుకుని భోజనాలు చేశారు. సుమారు 30వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. కాగా మినీ జాతర(మండమెలిగే పండుగ)కు ఇంకా రెండు రోజులే మిగిలి ఉంది. ఈ క్రమంలో ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. వివిధ పనుల్లో ఆయా శాఖల అధికారులు నిమగ్నమయ్యారు.

పోలీస్ ఉన్నతాధికారుల దర్శనం..

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ గౌస్ ఆలం, ఓఎస్డీ అశోక్‌కుమార్, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్ వనదేవతలను దర్శించుకున్నారు. అలాగే గోవిందరాజు, పగిడిద్దరాజులకు పూజలు చేశారు. ఆలయ సంప్రదాయంగా దేవాదాయశాఖ అధికారులు, పూజారులు డోలి వాయిద్యాలతో స్వాగతం పలికారు. పోలీస్ ఉన్నతాధికారులను పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య పట్టు వస్త్రాలతో సన్మానించి ప్రసాదం అందజేశారు. వారి వెంట పస్రా సీఐ శంకర్, ఎస్సైలు వెంకటేశ్వరరావు, కర్ణాకర్‌రావు ఉన్నారు.

చెక్ పోస్టుల ఏర్పాటు..


మేడారంలోని జంపన్నవాగు నుంచి వాహనాలను మేడారం ఐలాండ్ ప్రదేశం వరకు రాకుండా పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను పార్కింగ్ ప్రదేశాలకు మళ్లించారు. పస్రా సీఐ శంకర్, తాడ్వాయి, పస్రా ఎస్సైలు వెంకటేశ్వరరావు, కరుణాకర్‌రావులతో పాటు మరో ముగ్గురు ఎస్సైలు, 115 మంది సిబ్బంది మేడారంలో బందోబస్తు నిర్వహించారు. అమ్మవార్ల గద్దెల వద్ద భక్తుల రద్దీ నియంత్రణకు, దొంగతనాలు జరగకుండా చూసేలా పోలీసులు ప్రణాళికతో ముందుకుసాగుతున్నారు.

షవర్లకు నీటి కనెక్షన్ లేదు..

జంపన్నవాగు వద్ద స్నాన ఘట్టాలపై ఏర్పాటు చేసిన షవర్లకు నీటి కనెక్షన్ ఇవ్వకపోవడంతో భక్తులు జల్లు స్నానాలు చేసేందుకు ఇబ్బందులు పడ్డారు. మినీ జాతరకు రెండు రోజులే ఉన్నా సౌకర్యాల ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారిస్తున్నారే తప్ప ముందస్తుగా వచ్చే భక్తుల గురించి పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. మేడారం పరిసరాల్లో అధికారులు అక్కడక్కడా నల్లాలు ఏర్పాటు చేశారు. కానీ కనెక్షన్ ఇవ్వలేదు. అలాగే తాగునీటి వసతి లేకపోవడంతో భక్తులు మినరల్ వాటర్ క్యాన్లను కొనుగోలు చేస్తున్నారు.

'ఏసీడీ' భారం

- విద్యుత్ వినియోగదారుల ఆందోళన
- అదనపు బిల్లులతో బెంబేలు
- డిపాజిట్ కోసమే ఏసీడీ అంటున్న అధికారులు



TC Seal : N		CAP : 5-
ENERGY CHARGES	:	557.20
FIXED CHARGES	:	20.00
CUST CHARGES	:	90.00
ED	:	8.82
ED INT	:	0.04
ADDL Charges	:	25.00
ROUNDING	:	-0.06
TOTAL AMOUNT	:	701.00
AS ON 01-04-22	:	0.00
AFTER 01-04-22	:	0.00
NET AMOUNT	:	701.00
ACD DUE	:	2160.00
LAST PAID	:	09/11/2022
LAST PAID AMT	:	2596.00
DUE DATE	:	26/01/2023
DISC DATE	:	10/02/2023

నెహ్రూసెంటర్: విద్యుత్ శాఖ విధిస్తున్న పలు రకాల అదనపు చార్జీల భారంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఫిక్స్‌డ్ చార్జీ, కస్ట్ చార్జీ, ఈడీ, అడిషనల్ చార్జీల పేరుతో వినియోగదారులపై భారం మోపుతున్నారు. నెలవారీ విద్యుత్ బిల్లుతో పాటు ఏసీడీ బిల్లు కూడా చెల్లించాలని విద్యుత్‌శాఖ అధికారులు చెప్పడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు రకాల చార్జీలు, ఆలస్య రుసుంలు, ఇతర చార్జీల పేరుతో బిల్లులు చెల్లిస్తుండగా మళ్లీ కొత్తగా ఏసీడీ చార్జీలు విధించడంతో ప్రజలు అయోమయానికి గురై సంబంధిత అధికారులు, విద్యుత్‌శాఖ కార్యాలయాల వద్దకు పరుగులు పెడుతున్నారు. ఎడాపెడా వాయిస్తున్న చార్జీలతో విద్యుత్‌శాఖపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

అవగాహన కల్పించకుండానే..

ప్రతి నెలా విద్యుత్ వినియోగచార్జీలు వందల్లో వస్తే ఒక్కసారిగా ఏసీడీ పేరిట వేలల్లో చెల్లించాలని రావడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్‌శాఖ ప్రజలపై మోపుతున్న భారాన్ని అదనపు చార్జీలను ఎందుకు చెల్లించాలంటూ ప్రశ్నిస్తున్నారు. ఏసీడీపై వినియోగదారులకు అవగాహన కల్పించిన అనంతరం బిల్లు ఇవ్వాల్సి సంబంధిత శాఖ.. అలాంటి చర్యలు ఏమీ చేపట్టకుండానే అదనపు చార్జీలు చెల్లించాలనడం సరికాదని ప్రజలు అంటున్నారు.

ఏసీడీ ఇలా..

ఇంటికి కరెంట్ మీటరు తీసుకునే సమయంలో విద్యుత్‌శాఖ కొంత మొత్తాన్ని డిపాజిట్‌గా తీసుకుంటుంది. ఈ మధ్య కాలంలో విద్యుత్ వినియోగం అధికంగా పెరగడంతో రెండు నెలల వినియోగానికి సరిపడా డిపాజిట్ డబ్బులు విద్యుత్ సంస్థ వద్ద ఉంచాల్సి ఉంటుంది. దీనినే అడిషనల్ కన్జంప్షన్ డిపాజిట్ (ఏసీడీ) అంటారు. డిపాజిట్ చేసిన డబ్బులకు బ్యాంకు రేట్ ప్రకారం వడ్డీ కూడా ప్రతి సంవత్సరం మేలో బిల్లులో మైనస్ చేసి ఇస్తారు. ఒకవేళ డిపాజిట్ తక్కువగా ఉన్నట్లయితే అదనపు డిపాజిట్ కట్టాల్సిందిగా విద్యుత్ సంస్థ అడుగుతుందని, ఇది కేవలం డిపాజిట్ మాత్రమేనని అధికారులు చెబుతున్నారు. వినియోగదారులు సర్వీస్‌ను రద్దు చేసుకున్నప్పుడు డిపాజిట్ డబ్బులను తిరిగి చెల్లిస్తారు.

రూ.1,554 ఏసీడీ డ్యూ అని వచ్చింది..



మాకు కరెంట్ బిల్లుతో పాటు రూ.1,554 ఏసీడీ డ్యూ వచ్చింది. అసలే అదనపు చార్జీలతో ఇబ్బందులు పడుతున్న మాపై ఏసీడీ భారం మోపడం సరికాదు.ప్రభుత్వం స్పందించి అదనపు బిల్లులను రద్దు చేయాలి.

- మంద శంకర్, స్థానికుడు

ఏసీడీ డిపాజిట్ మాత్రమే..



ఏసీడీ అనేది కేవలం రెండు నెలల విద్యుత్ వినియోగానికి సరిపడా డిపాజిట్ మాత్రమే. సర్వీస్ రద్దు చేసుకున్న సమయంలో తిరిగి ఇవ్వబడుతుంది. విద్యుత్ వినియోగదారులు కరెంట్ బిల్లుతో పాటు ఏసీడీని కూడా చెల్లించాలి. విద్యుత్ చట్టం ప్రకారం రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆమోదించిన నిబంధనల మేరకే చార్జీలు వేయబడుతాయి.

- పి.విజయ్ డీఈ, మహబూబాబాద్

ఆందోళన బాటలో ప్రజలు

విద్యుత్‌శాఖ విధిస్తున్న అదనపు చార్జీలపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వేలల్లో చార్జీలను, డిపాజిట్లు చెల్లించాలంటే పేద, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ప్రజలపై మోపుతున్న అదనపు భారాన్ని తగ్గించాలని జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసనలు, వినతిపత్రాలు అందించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మరికొన్ని పార్టీలు విద్యుత్‌శాఖ ఎదుట నిరసన ఆందోళనలకు పిలుపునిచ్చాయి.

మేడారంలో వైద్య సేవలు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం మినీ జాతరలో భక్తులకు అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ములుగు డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మేడారంలోని కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ అప్పయ్య, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ అప్పయ్య మాట్లాడుతూ.. రేపటి వరకు ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు వైద్య సేవలందించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 1నుంచి 4వ తేదీ వరకు 24 గంటలు భక్తులకు వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. 50వేల మాస్కులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రూ.10లక్షల విలువ గల మందులను వైద్య శిబిరంలో అందుబాటులో ఉంచుతామన్నారు. జాతరలో భక్తులు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా వైద్యం చేయించుకోవాలన్నారు.

అటవీ హక్కు చట్టాల రద్దుకు కేంద్రం కుట్ర

నెహ్రూసెంటర్: గిరిజనులు పోరాడి సాధించుకున్న అటవీ హక్కు చట్టాలను రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు అచ్యుత రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్డీ కార్యాలయంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. అటవీ సంరక్షణ నియమాలు పేరిట వందల సంవత్సరాలు పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను రద్దు చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. అటవీ సంపద, భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు సంస్కరణలు తీసుకువస్తున్నారని, దీనిని ప్రజలందరూ ఐక్యంగా ఎదుర్కొవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి కాలయాపన చేస్తుందని, పోడు సాగుదారులను భూముల నుంచి వెళ్లగొట్టేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి పోడుసాగుదారుడికి పట్టాలు, హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర, రుణవిముక్తి చట్టాల కోసం ఐక్యంగా పోరాటాలను నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరాజు రణధీర్, మామిడాల భిక్షపతి, జడ సత్యనారాయణ, గౌని ఐలయ్య, అనంతరెడ్డి, దేశెట్టి రాంచంద్రయ్య, యడ్లపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అచ్యుత రామారావు

క్లుప్తంగా

శ్రీకర ఫిజియో క్లినిక్ ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న జనగామ జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి, నిర్వాహకులు

హన్మకొండ అర్బన్‌: హనుమకొండ బాలసముద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకర క్లినిక్, ఫిజియో థెరపి సెంటర్‌ను ఆదివారం జనగామ జిల్లా పరిషత్ ఛైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. నగర ప్రజలకు కీళ్ల సంబంధ వ్యాధులకు సంబంధించి శ్రీకర ఫిజియో క్లినిక్, ఫిజియోథెరపిలో మంచి వైద్య సదుపాయం అందుబాటులో ఉంటుందన్నారు. ప్రజలు సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ అఖిల్ దాడి, డాక్టర్ ఈశ్వర్‌పటేల్, డాక్టర్ హెచ్.వినయ్‌కుమార్, డాక్టర్ రాకేష్ కొమురవెల్లి, డాక్టర్ అనీల్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో చలనరహిత స్థితి



కవిత్వ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, తదితరులు

విద్యారణ్యపురి / హన్మకొండ కల్చరల్‌: ప్రస్తుత సమాజంలో జరుగుతున్న దురాగతాలకు ఏ రకమైన స్పందన లేకుండా చలన రహితంగా తమ జీవితాలను మనుషులు సాగిస్తున్న దుస్థితి కనిపిస్తోందని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య అభిప్రాయపడ్డారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో కాసుల రవికుమార్ రాసిన 'గడ్డకట్టిన నది కవిత్వ' పుస్తకావిష్కరణ కార్యక్రమం హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ కళాశాలలో ఆదివారం జరిగింది. కవి మారేడుకొండ బ్రహ్మచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బన్న అయిలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. చలనానికి సూచిక నది అని, మానవ జీవితం కూడా చలనశీలమైనదని వివరించారు. సమాజంలో స్పందన కరువైందని వాపోయారు. కాసుల రవికుమార్ రచించిన ప్రతీ కవితలోనూ మానవీయ కోణం కనిపిస్తోందని వివరించారు. కాగా, కవి పరిచయాన్ని పింగిళి ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ అధ్యాపకుడు డాక్టర్ మార్క శంకర్‌నారాయణ చేయగా, డాక్టర్ పల్లేరు వీరస్వామి పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో కవి పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, అన్వర్, బండారి రాజ్‌కుమార్, నల్లెల్ల రాజయ్య, సోని, వాణిశ్రీ, శిల్ప, జగదీశ్, అస్నాల శ్రీను, ప్రకాశ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

'అట్లాస్'లో అంతంతే..!



సాక్షిప్రతినిధి, వరంగల్‌: జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీడీపీ)లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వెనుకబాటు కనిపిస్తోంది. హనుమకొండ 17వ స్థానంలో ఉండగా.. ములుగు 33వ స్థానానికి పరిమితమైంది. 2020–21 సంవత్సరానికి ప్రస్తుత ధరల్లో జీడీడీపీ విలువ పెరుగుదల కనిపించినప్పటికీ ఆశించిన స్థాయిలో వృద్ధి సాధించలేదు. తలసరి ఆదాయంలో మాత్రం జేఎస్ భూపాలపల్లి రాష్ట్రంలోనే 4వ స్థానంలో నిలిచింది. జాతీయ ధరల సూచీ ప్రకారం దీనిని గణిస్తారు. ఇదే సమయంలో మిగతా ఐదు జిల్లాలు తలసరి ఆదాయంలో వెనకబడ్డాయి.

ఆర్థికాభివృద్ధిపై పథకాల ముద్ర..

జీడీడీపీ వృద్ధిలో వెనుకబడినా.. ఉమ్మడి వరంగల్ జిల్లాలు వృద్ధి చెందడానికి సాగునీరు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు దోహదం చేస్తున్నాయి. ఏటా అన్‌గోయింగ్ ప్రాజెక్టుల ద్వారా ఉమ్మడి జిల్లాలో 9.08 లక్షల ఎకరాలకు నీరందిస్తుండటంతో సాగు పెరిగింది. వరి, పత్తి, కంది, వేరుశనగ పంటల ద్వారా రైతుల ఆదాయం పెరుగుతోంది. ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువవుతున్నాయి. విద్య, వైద్యం అందుబాటులోకి వచ్చింది. రైతుబంధు, ఆసరా పింఛన్లు, గొర్రెల పంపిణీ, సబ్సిడీ, తక్కువ వడ్డీతో రుణాలు అందించడంతో ప్రజల్లో ఆర్థిక స్వావలంబన పెరుగుతోంది. అక్షరాస్యత శాతం తక్కువగా ఉండటం, గ్రామస్థాయికి వైద్య సేవలు ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉంది.

సగటున 20.2 శాతం పట్టణవాసం..

లింగనిష్పత్తిలో భేష్.. అక్షరాస్యతే పెరగాలి..

ఉమ్మడి వరంగల్ జనాభా 38,20,369కి చేరగా.. సగటున 20.2 శాతం (7,71,714) మంది నగరాలు, పట్టణాల్లో ఉంటున్నారు. అయితే అత్యధికంగా హనుమకొండ తర్వాత వరంగల్‌కు చెందిన వారే ఇందులో ఎక్కువగా ఉన్నారు. హనుమకొండ జిల్లా జనాభా 10,62,247లో సుమారు 5.64 లక్షల (53.1 శాతం) మంది, వరంగల్‌లో 7,37,148లకు 2.27 లక్షల (30.8 శాతం) మంది నగరాలు, పట్టణాల్లో ఉంటున్నారు. కాగా.. లింగనిష్పత్తి విషయానికొస్తే వెయ్యి మంది మగవారికి ములుగు జిల్లాలో 1,015 మంది మహిళలు ఉండగా, జేఎస్ భూపాలపల్లిలో 1,004 మంది ఉన్నారు. మిగతా జిల్లాల్లో వెయ్యి మంది పురుషులకు 995, 996, 997లుగా మహిళలు ఉన్నారు. కాగా.. మారుమూల పల్లెలకు చెందిన చాలా మంది విద్యార్థులు హైస్కూల్, ఇంటర్ విద్యకే పరిమితమవుతున్నారు. దీనిని అధిగమించాల్సిన అవసరం ఉంది. ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి ప్రకారం సగటున 18 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండగా, అక్షరాస్యతలో హనుమకొండ 74 శాతం, వరంగల్ 64.6, జనగామ 61.6, మహబూబాబాద్ 57.8, జేఎస్ భూపాలపల్లి 59, ములుగు 62.3 శాతంగా ఉన్నాయి.

- 2018 నుంచి 2022 మార్చి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9,956 మంది రైతులు వివిధ కారణాలతో మరణించగా.. వారందరికీ ప్రభుత్వం రైతుబీమా కింద ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున పరిహారం అందజేసింది. ఇందులో అత్యధికంగా 49 నుంచి 59 ఏళ్ల వారు 3.986 ఉండగా.. 18 ఏళ్ల నుంచి 28 ఏళ్ల వరకున్న యువ రైతులు 413 మంది మరణించడం గమనార్హం. గతంలో కూడా రైతు ఆత్మహత్యల్లో ఉమ్మడి జిల్లా మూడో స్థానంలో ఉండగా.. తాజాగా ఇప్పుడు ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలోనూ ఈ విషయం స్పష్టం కావడం ఆందోళన కలిగిస్తోంది.
- జాతీయ రహదారులతోపాటు పంచాయతీరాజ్, రోడ్లు, భవనాల శాఖ(ఆర్‌అండ్‌బీ) ఆధ్వర్యంలోని రహదారుల్లో ఉమ్మడి జిల్లా రాష్ట్రంలో తీసిపోకుండా నిలిచింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్రంలోనే రద్దీ రహదారి అయిన హైదరాబాద్–వరంగల్–భూపాలపల్లి, కోదాడ–వరంగల్–రాయపట్నం, హైదరాబాద్–వరంగల్, వరంగల్–సిద్దిపేట రహదారులతోపాటు సుమారు ఆరు వరకు జాతీయ రహదారులు వెళ్తుండగా, ప్రస్తుతం కొన్ని నిర్మాణంలో ఉన్నాయి.
- ఉపాధిహామీ పథకం కింద నమోదు చేసుకుంటున్న కూలీలు.. ఆ తర్వాత ఆ పనికి వెళ్లడం లేదు. ఉమ్మడి జిల్లాలో సుమారు 17.50 లక్షలకుపైగా జాబ్ కార్డులున్న వారిలో 6.70 లక్షల మంది వరకు మాత్రమే కూలీ పని చేస్తున్నట్లు నివేదిక పేర్కొంది. అత్యధికంగా భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో 41 శాతం మంది ఉపాధి పనులకు వెళ్తుండగా.. హనుమకొండ 32, ములుగు 35, వరంగల్ 36, జనగామలో 37 శాతం మంది కూలీలే పనులు చేస్తున్నారు.

మహిళా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

- రూ.5.10 కోట్లతో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: మహిళల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సెర్ప్, స్త్రీనిధి సంస్థల ఆధ్వర్యంలో తొర్రూరు, పెద్దవంగర మండలాల మహిళలకు మండలంలోని వెలికట్ట శివారు శ్రీనివాస గార్డెన్‌లో కుట్టు శిక్షణ శిబిరం ఆదివారం ప్రారంభమైంది. మహబూబాబాద్ కలెక్టర్ శశాంకతో కలిసి మంత్రి దయాకర్‌రావు శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉచితంగా కుట్టు శిక్షణ అందించి వృద్ధిలోకి తీసుకువచ్చేందుకు రూ.5.10 కోట్లతో రాష్ట్రంలో తొలి శిక్షణ శిబిరం నియోజకవర్గంలో ప్రారంభించామన్నారు. కుట్టు శిక్షణ, మిషన్ల కోసం సెర్ప్ నుంచి రూ.10వేలు, స్త్రీనిధి నుంచి రూ.7వేల చొప్పున ఒకరిపై రూ.17 వేలు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ పథకం కింద మహిళలకు శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లు అందిస్తామని సీఎం కేసీఆర్‌కు తెలిపితే సంతోషించారన్నారు. 3వేల మందికి కుట్టు శిక్షణ ఇచ్చి ప్రభుత్వపరంగా దుస్తుల ఆర్డర్ వస్తే తొలుత వారికే అవకాశం దక్కేలా చూస్తానన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మహిళా సంఘాలకు రూ.4 వేల కోట్ల రుణాలు మంజూరైతే రాష్ట్రం వచ్చాక రూ.18 వేల కోట్లు రుణాలు మంజూరు చేశామని తెలిపారు. మహిళల కోసం ఆరోగ్యలక్ష్మి, భరోసా కేంద్రాలు, షీ టీమ్స్, కేసీఆర్ కిట్, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలెన్నో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. దేశంలోనే ఎస్సీ, ఎస్టీ అమ్మాయిల కోసం 53 డిగ్రీ గురుకులాలు ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆడబిడ్డ పుడితే రూ.13 వేలు అందిస్తున్నామని, కేసీఆర్ కిట్ ద్వారా 11లక్షల మంది లబ్ధి పొందారన్నారు. దేశానికి నాయకత్వం వహించేందుకు బయలుదేరిన కేసీఆర్‌ను మహిళలు దీవించాలన్నారు. అనంతరం కలెక్టర్ శశాంక మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు కుట్టు శిక్షణ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు తూర్పాటి చిన్నఅంజయ్య, ఈదురు రాజేశ్వరి, జెడ్పీటీసీలు మంగళపల్లి శ్రీనివాస్, శ్రీరాం జ్యోతిర్మయి, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఆర్డీఓ రమేష్, మహిళా సంఘాల నాయకులు నాగమణి, రేణుక, విజయ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జియాలాజికల్ సర్వే బృందం పర్యటన

- రామప్ప, వేయిస్తంభాల ఆలయాల సందర్శన



వేయిస్తంభాల ఆలయంలోని కల్యాణమండపం వద్ద బృందంతో మల్లికార్జున్‌రెడ్డి

కేయూ క్యాంపస్‌: 10 దేశాలకు చెందిన జియాలాజికల్ సర్వే బృందం శాస్త్రవేత్తలు ఆదివారం రామప్ప, వేయిస్తంభాల ఆలయాలను సందర్శించారు. వారికి కాకతీయ యూనివర్సిటీ జియాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి ఆలయాల విశిష్టత, నిర్మాణం సందర్భంగా ఆనాడు కాకతీయులు అనుసరించిన పద్ధతులను వివరించారు. సాండ్ బాక్స్ టెక్నాలజీ గురించి తెలియజేశారు. అలాగే, వరంగల్ నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు భూకంప తీవ్రతను 800 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కట్టడాలు ఎలా తట్టుకున్నాయో వివరించారు. రామప్ప గుడిలో నీటిలో తేలియాడే ఇటుకలు, శిల్పకళను చూసి విదేశీయులు ఆశ్చర్యం వ్యక్తం చేసినట్లు మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. బృందానికి పాండురంగారావు రచించిన పుస్తకాలను బహూకరించారు. ఇరాన్, ఇథియోపియా, సూడాన్, దక్షిణ సుడాన్, ఉగండా, కమారోన్, ఖజికిస్తాన్, బంగ్లాదేశ్ తదితర దేశాల ప్రతినిధులు సందర్శించిన వారిలో ఉన్నారు. వీరంతా జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా జియాలజిస్టులు అమ్రుత్తే, మల్లేశం పర్యవేక్షణలో పర్యటించారు.



గెలుపొందిన జయముఖి జట్టు



గెలుపొందిన బిట్స్ కళాశాల జట్టు

హోరాహోరీగా సాక్షి ప్రీమియర్ లీగ్



గెలుపొందిన తాళ్ల పద్మావతి కళాశాల జట్టు

రామన్నపేట : వరంగల్ ములుగు రోడ్డులోని లాల్ బహదూర్ కళాశాలలో సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. రెండో రోజు ఆదివారం మొదటి మ్యాచ్‌లో తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల, కాకతీయ ఫిజియో కళాశాల జట్లు తలపడ్డాయి. తాళ్ల పద్మావతి జట్టు టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కాకతీయ ఫిజియో కళాశాల జట్టు 9.3 ఓవర్లలో 70 పరుగులకు ఆలౌట్ అయింది. 13 పరుగుల తేడాతో తాళ్ల పద్మావతి కళాశాల జట్టు విజయం సాధించింది. 45 పరుగులు సాధించిన శివకృష్ణ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ దక్కించుకున్నాడు.

- రెండో మ్యాచ్‌లో క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల(సీజేఐటీ), బిట్స్ కళాశాల జట్లు తలపడ్డాయి. సీజేఐటీ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. దీంతో మొదటగా బ్యాటింగ్ చేసిన బిట్స్ జట్టు 10 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 76 పరుగులు సాధించింది. అనంతరం చేధనలో సీజేఐటీ జట్టు 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 54 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో 22 పరుగుల తేడాతో బిట్స్ కళాశాల జట్టు విజయం సాధించింది.
- మూడో మ్యాచ్‌లో జిట్స్(జయముఖి) కళాశాల జట్టు– వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల జట్లు తలపడ్డాయి. జిట్స్ జట్టు టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసింది. 10 ఓవర్లలో 76 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన వాగ్దేవి కళాశాల జట్టు 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 61 పరుగులు మాత్రమే చేసింది. జిట్స్ జట్టులో మూడు వికెట్లు తీసి పరుగులు సాధించి రోహన్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నాడు. ఈ మ్యాచ్‌లో జయముఖి బ్యాట్స్‌మెన్ 62 పరుగులతో బెస్ట్ పార్ట్‌నర్ షిప్ రికార్డు నెలకొల్పారు.



తలపడుతున్న ఇరుజట్ల క్రీడాకారులు

స్పౌజ్ కేటగిరీలో అవకాశం కల్పించాలి

- మంత్రి సబితాఇంద్రారెడ్డిని కలిసి అభ్యర్థించిన స్పౌజ్ కేటగిరీ టీచర్ల ఫోరం బాధ్యులు



మంత్రి సబితాఇంద్రారెడ్డితో స్పౌజ్ కేటగిరీ టీచర్ల ఫోరం బాధ్యులు, టీచర్లు

విద్యారణ్యపురి: స్పౌజ్ కేటగిరీలో స్కూల్ అసిస్టెంట్లతోపాటు ఎస్‌జీటీ, పండిట్, పీఈటీల బదిలీలు చేపట్టాలని ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు స్పౌజ్ టీచర్లు ఆదివారం హైదరాబాద్‌లో విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని కలిసి అభ్యర్థించారు. 13 జిల్లాల్లో స్పౌజ్ కేటగిరీ బదిలీల కోసం 2,100 కుటుంబాలు ఏడాదిగా వేచిచూస్తుండగా వారిలో 615 మంది స్కూల్ అసిస్టెంట్లకు మాత్రమే బదిలీలకు అనుమతించారని, దీంతో మిగతా వారి కుటుంబాలు ఆవేదనలో ఉన్నాయని మంత్రికి వివరించారు. పదోన్నతుల ద్వారా ఎస్‌జీటీ కేటగిరీలోనూ ఖాళీలు ఏర్పడతాయని అందువల్ల తమను కూడా బదిలీలకు అనుమతించాలని కోరారు. స్పందించిన మంత్రి ఎస్‌జీటీ, పండిట్, పీఈటీలకు కూడా స్పౌజ్ కేటగిరీలో బదిలీలు జరుపుతామని హామీ ఇచ్చారని సంబంధిత బాధ్యులు తెలిపారు. కాగా, తొలుత మంత్రి హరీశ్‌రావును కలిసి ఎండార్స్‌మెంట్ చేసిన లేఖను మంత్రి సబితాఇంద్రారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్పౌజ్ టీచర్ల ఫోరం బాధ్యులు కందగట్ల సురేష్, యంసాని వేణు, పోలోజు శ్రీహరి, నేరేళ్ల సాంబమూర్తి, నడిగోటి వసంతకుమార్, ఎల్తూరి సర్సయ్య, ఒంటెల సతీష్, శ్రీపాల్‌రెడ్డి, నర్సయ్య, లక్ష్మణ్, రాష్ట్ర బాధ్యులు నరేష్, కృష్ణ, మమత తదితరులు పాల్గొన్నారు.

చిట్టీ కట్టలేదని కుటుంబంపై దౌర్జన్యం

- మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఖిలా వరంగల్‌: చిట్టీ కట్టలేదని కుటుంబంపై ఓ చిట్‌ఫండ్ కంపెనీ దౌర్జన్యానికి దిగింది. వివరాలిలా ఉన్నాయి. వరంగల్ పుప్పాలగుట్ట ప్రాంతానికి చెందిన షేక్ జాఫర్ హుస్సేన్, వాహిదా దంపతుల కుమారుడు సద్దాం హుస్సేన్ అక్షయ ధరణి చిట్‌ఫండ్ కంపెనీలో రూ.10లక్షల చిట్టీ వేసి రూ.5లక్షల వరకు కట్టాడు. గత మూడు నెలల క్రితం రూ.10లక్షల చిట్టీ ఎత్తుకున్నాడు. నిర్వాహకులకు నెలవారిగా చిట్టీ డబ్బు కడుతున్నాడు. కొద్ది నెలల క్రితం సద్దాం హుస్సేన్ ఉద్యోగరిత్యా ముంబాయి వెళ్లగా అతడి తండ్రి షేక్ జాఫర్ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. పుప్పాల గుట్ట ఇంటి వద్ద హుస్సేన్ తల్లి, భార్య మాత్రమే ఉంటున్నారు. చిట్టీ డబ్బు కట్టడంలో జాప్యం కావడంతో పుప్పాలగుట్టలోని సద్దాం హుస్సేన్ ఇంటికి ఆదివారం అక్షయ ధరణి చిట్‌ఫండ్ కంపెనీ సిబ్బంది శ్రీకాంత్, శ్యామ్‌తోపాటు 10 మంది చేరుకుని కుటుంబ సభ్యులను నిలదీశారు. దుర్భాషలాడుతూ ఇంట్లోని సామాన్లను చిందరవందర చేసి డోర్ తొలగించారు. దీంతో భయాందోళనకు గురైన సద్దాం హుస్సేన్ కుటుంబ సభ్యులు మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

శాస్త్రవేత్తగా గిరిజన ఆణిముత్యం

- ఏఎస్ఆర్‌బీ పరీక్షల్లో ప్రథమస్థానం
- ప్రస్తుతం హైదరాబాద్ ఇక్రిశాట్‌లో పీహెచ్‌డీ చేస్తున్న అశ్విని



అశ్విని



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న అశ్విని

గార్ల: వర్సిటీ స్థాయిలోనేకాక జాతీయ స్థాయిలోనూ ప్రథమ స్థానం సాధించి గిరిజన ఆణిముత్యం అశ్విని శాస్త్రవేత్తగా ఎంపికైంది. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం గంగారంతండాకు చెందిన రైతు సూనావత్ మోతీలాల్–నేజల కూతురు అశ్విని చిన్ననాటి నుంచే చదువులో దిట్ట. ఇటీవల ప్రకటించిన జాతీయ స్థాయి వ్యవసాయ శాస్త్రవేత్తల నియామక మండలి(ఏఎస్ఆర్‌బీ) ఫలితాల్లో ప్రథమస్థానంలో నిలిచి జెనిటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్‌లో శాస్త్రవేత్తగా ఎంపికైంది. ఖమ్మం జిల్లా అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో 2014–18 వరకు ఏజీబీఎస్సీ చదివింది. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ప్రథమస్థానం సాధించి 6 బంగారు పతకాలు గెలుపొందింది. ఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చర్ రీసర్చ్ ఇనిస్ట్యూట్‌లో 2018 – 20 వరకు ఏజీఎమ్మెస్సీ పూర్తి చేసి ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఇక్రిశాట్‌లో పీహెచ్‌డీ పరిశోధకురాలిగా పనిచేస్తుంది. శాస్త్రవేత్తగా ఎంపికైన అశ్వినిని గ్రామస్తులతో పాటు దక్షిణ మధ్య రైల్వే రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ కృష్ణచవాన్ అభినందించారు.

వివాహిత అదృశ్యం



సుజాత

కాజీపేట: పుట్టింటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వివాహిత అదృశ్యమైంది. ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన కూనమల్ల సంజీవ భార్య సుజాత అలియాస్ నిరోషా(29) ఈ నెల 9న తల్లిగారింటికి బయలుదేరింది. కాగా, ఈ నెల 24న గంగారంలో బావమరిది రవి చనిపోవడంతో వెళ్లిన సంజీవకు సుజాత కనిపించలేదు. ఫోన్ చేస్తే స్విచాఫ్ వచ్చింది. బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేదు. సంజీవ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు. ఆచూకీ తెలిస్తే 87126 85008, 87126 85245 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

యువతి పెళ్లికి నిరాకరించిందని..

- అన్నారం బ్యారేజీ కెనాల్‌లో దూకి యువకుడి ఆత్మహత్య



వినోద్‌రెడ్డి (ఫైల్)

కాళేశ్వరం: మూడుముళ్ల బంధంతో ఒక్కటవుదామనుకున్నారు. తీరా యువతి పెళ్లికి నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం బ్యారేజీ కెనాల్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకోగా వివరాలిలా ఉన్నాయి. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లిలోని 1000 క్వార్టర్స్‌లో ఉండే సింగరేణి కార్మికుడు గుండా తిరుపతిరెడ్డి – సుజాతల రెండో కుమారుడు వినోద్‌రెడ్డి(29) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఫార్మా కంపెనీలో మెడికల్ రిప్రజెంటివ్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కాటారం మండలానికి చెందిన యువతి, వినోద్‌రెడ్డి వివాహం జరిపించాలని ఇరు కుటుంబాల పెద్దలు మాట్లాడుకున్నారు. ఇంకా నిశ్చితార్థం చేసుకోలేదు. ఇరువురి మధ్య స్నేహం పెరిగి ఫోన్‌లో మాట్లాడుకునేవారు. కాగా వారం రోజులుగా యువతి నుంచి ఫోన్ లేదు. దీంతో అనుమానం వచ్చి అడగగా తనకు పెళ్లి ఇష్టం లేదని తేల్చి చెప్పింది. ఈ విషయమై నాలుగు రోజులుగా వినోద్‌రెడ్డి తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల వద్ద బాధపడేవాడు. ఈ క్రమంలో శనివారం మిత్రులతో పరకాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. సాయంత్రం కుటుంబీకులు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. దీంతో వినోద్‌రెడ్డి కోసం గాలించగా అన్నారం బ్యారేజీ సమీపాన గ్రావిటీ కెనాల్ వద్ద హ్యుందాయ్ కారు, చెప్పులు, సెల్‌ఫోన్, పర్సు లభించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై లక్ష్మణ్‌రావు సిబ్బందితో వచ్చి పరిశీలించారు. ఆదివారం సాయంత్రం వరకూ కాళేశ్వరం జాలర్లు నాటు పడవల సాయంతో గాలించగా బ్యారేజీ సమీపంలో మృతదేహం లభ్యమైంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు

నర్సింహులపేట: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం రామన్నగూడెం సమీపంలో ఆదివారం సాయంత్రం ఆటో బోల్తా పడింది. ఈఘటనలో కొమ్ములవంచకు చెందిన ఏడుగురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. కొమ్ములవంచకు చెందిన కూలీలు మిర్చి తోట పనులకు ఆటోలో వెళ్లి సాయంత్రం తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో రామన్నగూడెం శివారు రహదారిపై గేదె అడ్డురావడంతో ఆటో బోల్తా పడింది. దీంతో తోట ఉపేంద్ర, పార్వంది వెంకన్న, లచ్చమ్మ, యాకమ్మ, బేగం, సాలమ్మకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పలుగుల పంచాయతీ పరిధి కుంట్లం వద్ద గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. కుంట్లం గ్రామస్తులకు గోదావరిలో మృతదేహం తేలియాడుతూ కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. పురుషుడి మృతదేహంగా గుర్తించారు. అతడి వివరాలు తెలియకపోవడంతో అక్కడే పోస్టుమార్టం చేసి ఖననం చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, వివరాలు తెలిసినవారు సంప్రదించాలని ఎస్సై సూచించారు.

మినీ మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు



హన్మకొండ: ఫిబ్రవరి 1 నుంచి 5వ తేదీ వరకు జరిగే మినీ మేడారం జాతరకు హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఆదివారం నుంచి బస్సులు ప్రారంభమయ్యాయి. ప్రతి 40 నిమిషాలకు ఒక బస్సు చొప్పున నడపాలని అధికారులు నిర్ణయించారు. భక్తులు వచ్చే సంఖ్యను బట్టి అప్పటికప్పుడు బస్సులు సమకూర్చి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేరవేస్తామని అధికారులు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.